క్లుప్తంగా

మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా నాగబాబు



కడియం మండల ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ సభ్యులు, నాయకులు

కడియం: మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కడియం గ్రామానికి చెందిన గ్రంధి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘ కల్యాణ మండపంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వారణాశి శ్రీనివాసగుప్త, కార్యవర్గ సభ్యులు కాకి దుర్గాప్రసాద్, కటకం సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ కార్యదర్శిగా కంచర్ల మూర్తి, ఉపాధ్యక్షుడిగా గ్రంధి సత్యనారాయణమూర్తి, కోశాధికారిగా సంబూరి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా కంచర్ల వీరబాబు, గౌరవాధ్యక్షుడిగా తమ్మన హరిబాబు ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతన అధ్యక్షుడు నాగబాబు మాట్లాడుతూ సంఘం పురోభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఉంగరాలకు గురుతేజం అవార్డు

కడియం: కడియం గ్రామానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు ఉంగరాల వీరభద్రరావు గురుతేజం అవార్డును అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం పుష్కర వనంలో ఆదివారం 'కాట్వా' సంఘం ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందించారన్నారు. 26 ఏళ్లుగా గణిత శాస్త్రాన్ని బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దినందుకు ఈ అవార్డును అందజేశారని అన్నారు. కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కందుల దుర్గేష్, గిరజాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారన్నారు.

సాహితీ ఉత్సవాలకు ఆహ్వానం



నాగ శ్రీశయన్

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన టీవీ, సినీ బాల నటుడు నాగ శ్రీశయన్‌కు ప్రపంచ కళా సాహితీ ఉత్సవాలకు సోమవారం ఆహ్వానం అందింది. సాహితీ సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో ఈ నెల 16, 17 తేదీలలో 30 గంటల పాటు నిర్వహించే సాంస్కృతిక, సాహిత్య కళా యజ్ఞంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని నాగ శ్రీశయన్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నదే తన లక్ష్యమన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రితో అధికారులు

రాజానగరం: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ క్రీడా పోటీల్లో భాగంగా గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రిని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. పాల్గొనే అభ్యర్థుల వయసు 15 ఏళ్ల పైబడి ఉండాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామ సచివాలయ స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 వరకూ, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకూ, నియోజకవర్గ స్థాయిలో 5 నుంచి 10, జిల్లా స్థాయిలో 11 నుంచి 21 వరకూ, రాష్ట్ర స్థాయిలో 22 నుంచి 25 వరకూ జరుగుతాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, నాయకుడు మండారపు వీర్రాజు, డిప్యూటీ తహసీల్దార్ సునీత, ఎంఈఓలు రామనదొర, జ్యోతిప్రసాద్, పీఎస్‌లు, పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: యానిమల్
సూర్యమినీ	: పల్లె గూటికి పండగొచ్చింది
సూర్యప్యాలెస్	: కాలింగ్ సహస్ర
స్వామి	: మంగళవారం
శివజ్యోతి	: కోటబొమ్మాళి పీఎస్
అనుశ్రీ	: కాలింగ్ సహస్ర
రాజా	: యానిమల్
అశోక	: యానిమల్
ఊర్వశి	: ఆదికేశవ
రంభ	: యానిమల్
మేనక	: అధర్వ
అప్సర	: యానిమల్
నామవరం	
దీఎస్.మహల్	: యానిమల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: యానిమల్
కడియం	
వెంకటసూర్య	: యానిమల్



పుష్కరఘాట్‌లో చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తికం.. దేదీప్యం

రాజమహేంద్రవరం సిటీ: నాగేంద్ర హారాయ త్రిలోచనాయ.. భస్మాంగ రాగాయ మహేశ్వరాయ నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి.. కార్తిక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని భక్తజనం శివాలయాలకు పోటెత్తారు. తెల్లవారు జామునే పవిత్ర గోదావరి చెంత పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కార్తిక దీపాలు వదిలారు. నగరంలోని పుష్కరాల రేవు, కోటిలింగాల రేవు, సరస్వతీ ఘాట్, గౌతమ ఘాట్ ఇలా మొత్తం 11 ఘాట్‌లలో నగరపాలక సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అక్కడ పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు గోదావరిలో కార్తిక దీపాలు వదిలారు. స్నానఘట్టాల్లో భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 24 గంటలు అందుబాటులో ఉండేలా మూడు షిఫ్టుల్లో అదనపు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. స్థానిక ఉమా మార్కండేయస్వామి ఆలయం, ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయం, విశ్వేశ్వరస్వామి, జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి, సారంగధరేశ్వర స్వామి తదితర ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.



గోదావరి నదిలో కార్తిక దీపాలు వదులుతూ..

తిరుమలరావుకు విజయలక్ష్మి పరామర్శ



నున్న చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, చిత్రంలో నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావును వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. సోమవారం కాతేరులోని తిరుమలరావు స్వగృహానికి వెళ్లి ఆయన తండ్రి నున్న చంద్రశేఖర్ చిత్రపటానికి జక్కంపూడి విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తిరుమలరావు, ఆయన సోదరులు నున్న కృష్ణ, నున్న సురేష్‌లను పరామర్శించారు.

బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించవద్దు



రఘుదేవపురంలో ఇటుక బట్టీని పరిశీలిస్తున్న సహాయ కార్మిక అధికారులు

సీతానగరం: బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించవద్దని సహాయ కార్మిక అధికారులు కార్తీక్, జాబీన సూచించారు. సోమవారం చైల్డ్ లేబర్ ఫ్రీ ఇండియా డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిర్వహించారు. మండలంలోని పెట్రోల్ బంకులు, హోటళ్లు, సామిల్లులు, దుకాణాలు, ఇటుకల బట్టీలను పరిశీలించారు. పిల్లలను పనుల్లోకి పెట్టుకుంటే బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష పడుతుందని యజమానులకు వివరించారు. అనంతరం సీతానగరం విష్ణాలయంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, ఇతర కార్మికులతో సమావేశం నిర్వహించారు. 'ఈ-శ్రమ్'లో సుమారు 50 మందిని ఉచితంగా నమోదు చేశారు. సిబ్బంది ప్రవీణ్, వందన, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పాటించాల్సినది జాగ్రత్తలే..

- నదీ స్నానాల్లో అప్రమత్తత అవసరం
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కార్తిక మాసం.. ఆధ్యాత్మికతకు నిలయం. అలాంటి మాసంలో పుణ్యస్నానాలకు భక్తులు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో ఘాట్లకు వస్తుంటారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి ఘటనలూ జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఘాట్ల వద్ద జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 11వ తేదీతో కార్తికమాస స్నానాలు ముగుస్తాయి. ఈ రోజుల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తుండడంతో ఘాట్ల వద్ద సుమారు 200 మంది వరకూ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. గోదావరిలో స్నానాలకు దిగే భక్తులకు పోలీసులు మైక్‌ల ద్వారా నిబంధనలు, సూచనలతో కూడిన జాగ్రత్తలను చెబుతున్నారు. నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కోటిలింగాల, పుష్కర ఘాట్‌లు, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మార్కండేయ స్వామి ఘాట్, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌతమ ఘాట్, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో రామపాదాల రేవులకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆయా ఘాట్‌ల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు పోలీసు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేశారు. ఘాట్ల వద్ద ఏదైనా ఇబ్బంది తలెత్తితే కంట్రోల్ రూమ్ నంబర్ 100112కు ఫోన్ చేయవచ్చు.



నగరంలో గోదావరి ఘాట్ వద్ద పోలీసు బందోబస్తు (ఫైల్)

నిబంధనలు ఇవీ..

కార్తికమాస స్నానాలు, కార్తిక దీపాలు వదిలే సమయంలో భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలి. ఘాట్ల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న, లోతుగా ప్రాంతాలకు వెళ్లరాదు. శైవాలయాలు, ఘాట్‌లు, గోదావరి నదీ తీర ప్రాంతాలు, కాలువలు, లోతుగా ఉన్న చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లేవారు ఆ ప్రాంతాల్లో సూచించిన హెచ్చరిక బోర్డులను గమనించాలి. పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని వెళ్లినట్లయితే వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఘాట్ల వద్ద స్నానాలు చేసే సమయంలో దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

అప్రమత్తంగా ఉండండి



గోదావరి నది, చెరువుల్లో స్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు ఉండే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించాలి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముఖ్యమైన ఘాట్ల వద్ద, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. పోలీసు వారు సూచించే నియమ, నిబంధనలు తప్పక పాటించి సహకరించాలి.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ, రాజమహేంద్రవరం

చేయీచేయీ కలిపితేనే రాజ్యాధికారం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- 10న శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, యాత కార్తిక వన సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: బీసీలంతా ఒకే మాటగా చేయీచేయీ కలిపి సాగితే రాజ్యాధికారం దిశగా అడుగులు వేయవచ్చని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. సోమవారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో బీసీల కార్తిక వన సమారాధన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీసీలు పాలించే శాసన కర్తలుగా ఎదగాలన్నారు. భవిష్యత్తు కార్యక్రమాలపై కలసి చర్చించుకునేందుకు ప్రతి బీసీ సోదరుడు కుటుంబ సభ్యులతో సహా వన సమారాధనకు తరలిరావాలని ఎంపీ పిలుపునిచ్చారు. దివాన్‌చెరువు పుష్కర వనంలో ఈ నెల 10న జరిగే వన సమారాధనకు దాదాపు 50 వేల మందికి పైగా రావచ్చనే ఉద్దేశంతో, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర గౌడ, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజు, వన సమారాధన కన్వీనర్ కడలి వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, మాజీ మంత్రులు కేఈ కృష్ణమూర్తి, పితాని సత్యనారాయణ, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితర బీసీ ప్రముఖులు హాజరవుతారని కమిటీ నిర్వాహకులు తెలిపారు. బీసీ సంఘీయులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, యాత కార్తిక వన సమారాధన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కడియం: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని బీజేపీ నాయకులు వివరించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం కడియపులంకలో కేంద్ర పథకాలపై ప్రచారం చేశారు. తహసీల్దార్ ఎం.సుజాత, ఎంఈఓ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నాయకులు కురగంటి సతీష్, ఎం.రజనీ, ఏనావు ఏసు, నాగులాపల్లి వీరబాబు, బోరుసు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: మూడు రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అర్బన్ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక పాల్గొన్నారు.



నగరంలో సంబరాలు జరుపుకొంటున్న బీజేపీ శ్రేణులు

జడివాన

- స్తంభించిన జన జీవనం
- ఇబ్బంది పడిన చిరు వ్యాపారులు

రాజమహేంద్రవరం సిటీ: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. తుపానుతో మంగళవారం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు వర్షంలో తడుస్తూ ఇంటిదారి పట్టారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని కాలువల్లో పూడికలు తొలగించే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలంటూ అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలసి ఆయన విస్తృతంగా పర్యటించారు. హైటెక్ బస్టాండు, తుమ్మలావ, కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లోని కాలువలలో యుద్ధప్రాతిపదికన పూడిక, చెత్తను తొలగించాలని ఆదేశించారు. నల్లా ఛానల్, ఎస్‌ఆర్‌సీపీ పంపింగ్ స్టేషన్లలో మోటార్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ప్రధాన నీటి సరఫరా కేంద్రంతో పాటు ఇతర మంచినీటి సరఫరా పంపిణీ స్టేషన్లలో మోటార్లు పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు. మంచి నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. నగరంలో మురుగు కాలువల నిర్మాణ పనులు జరుగుతున్న చోట పాదచారులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుపాను విధులు అప్పగించిన వారంతా సంసిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర సిబ్బంది వెంటనే విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, తుపాను సంబంధిత సమస్యలపై 94940 60060 ఫోన్ నంబరుకు తెలపాచ్చన్నారు. ఈ పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఈఈ అలీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్షంలో తడుస్తూ వస్తున్న విద్యార్థినులు



అర్జీలకు సత్వర పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 18 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల విస్తరణ, పార్కింగ్ స్థలం ఆక్రమణ, భూ సమస్యలు, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర అంశాలపై వినతులు వచ్చాయన్నారు. తుపాను నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు జన జీవనానికి ఆటంకం కలగకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పారిశుధ్య సమస్య రాకుండా చూడాలన్నారు. మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండింగ్ ఇంజినీర్ పాండురంగారావు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

'స్పందన' అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కేఆర్‌సీ తహసీల్దార్ సుగుణ ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీఓ తరఫున ఆమె పాల్గొని ప్రజల నుంచి మూడు అర్జీలు స్వీకరించారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్


శతాబ్దాల చరిత.. ఖకార్షా దర్గా ఘనత

- రేపటి నుంచి గంధోత్సవం
- అన్ని ఏర్పాట్లు పూర్తి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇన్నీసుపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమీపంలో హజరత్ సయ్యద్‌షా ఖకార్షా వలీబాబా దర్గా (ఖకార్షా)దర్గాకు ఘనమైన చరిత్ర ఉంది. రాజరాజనరేంద్రుని కన్నా ముందే క్రీస్తుశకం 850–950 ప్రాంతంలో బగ్దాద్ నుంచి ఇస్లాం పరిరక్షణకు సయ్యద్‌షా ఖకార్షా ఖాదర్ ఔలియా నగరానికి వచ్చి, ఇక్కడున్న చింతచెట్టు కింద నివసించేవారని చెబుతుంటారు. ఆయన సోదరి కూడా ఇక్కడకు వచ్చారని, ఆయన ఎన్నో మహిమలను ప్రదర్శించేవారని భక్తులు నేటికీ అంటుంటారు. ఖకార్షా దర్గా ప్రాంగణంలో పురాతన పుట్ట ఉంది. నాగులచవితి నాడు వేలాది మంది హైందవ భక్తులు ఈ పుట్టను సందర్శించి పూజలు చేస్తారు. పుట్ట ఉన్న ప్రాంతంలోనే హజరత్ నాగుల్ మీరా సాహెబ్ అనే భక్తుని దర్గా కూడా ఉంది. ఖకార్షా దర్గా ఉత్సవాలకు అన్ని విశ్వాసాల వారూ హాజరు కావడం విశేషం.

కార్యక్రమాలు ఇవీ..

ఖకార్షా దర్గా 296వ గంధోత్సవాలు ఈ నెల 6వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు సాయంత్రం 6 గంటలకు పన్నీరుస్నానం, 7న ఉదయం 7 గంటలకు ఖురాన్ పఠనం, 8న ఉరుసు గంధోత్సవం, మహాన్నదానం, గంధం (చందనం) గుర్రం పకీర్లతో ఊరేగింపు, 9న రాత్రి 9 గంటలకు మిలాద్ షరీఫ్ దీపారాధన, మొహమ్మద్ వారి ఔలియాలతత్వం (మారిఫత్‌కలాం) చదవడం చేస్తారు.



ఖకార్షా దర్గా భవనం



బాబావారి సమాధి వద్ద షేక్ అల్లాబక్ష్‌ముజావర్

ఐదు ప్రదక్షిణలు చేస్తే..

ఖకార్షా దర్గా వద్ద గంధోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. దర్గా వద్ద ఐదు ప్రదక్షిణలు చేస్తే కష్టాల నుంచి బయట పడవచ్చని భక్తులు విశ్వసిస్తారు. అందుకే పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. దర్గాలోకి స్త్రీలకు ప్రవేశం లేదు.

–షేక్ అల్లాబక్ష్, ముజావర్(షాగులాం), బాబా దర్గా కమిటీ ఆర్గనైజర్

ఘంటసాల పాటలు అజరామరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు అజరామరమని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు కొనియాడారు. సోమవారం స్థానిక గోదావరి గట్టున ఘంటసాల విగ్రహం వద్ద ఆయన జయంతి జరిగింది. అనంతరం స్థానిక విక్రమ హాలు వద్ద గాయకుడు రాయుడు చంద్రకుమార్ ఆధ్వర్యంలో ఘంటసాల గానామృతం ఆహూతులను అలరించింది. ముఖ్య అతిథులుగా రౌతు సూర్యప్రకాశరావు, కొండలరావు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణ, ప్రముఖ గాయకులు, నటుడు జిత్‌మోహన్‌మిత్ర పాల్గొని మాట్లాడారు. ఘంటసాల పాడిన పాటలు అజరామరమన్నారు. ఆ పాటలు తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. రాయుడు చంద్రకుమార్ ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు గీతాలను పాడి ఆహూతులను అలరించారు. మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, నగర ప్రముఖులు, ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గాన గంధర్వుడు ఘంటసాల జయంతిని ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయాల సమీపంలో ఉన్న ఘంటసాల విగ్రహం వద్ద రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దీనికి ముఖ్య అతిథిగా ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ఘంటసాల సంగీత ప్రపంచానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గాలి సుబ్బరాజు, రాకా రమణ, కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు, ఉపాధ్యక్షుడు పుసులూరి శేషుకుమార్, కార్యదర్శి గాదిరాజు రామరాజు, మోహన్ పబ్లికేషన్స్ మోహన్, భారత వికాస పరిషత్ పూర్వ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల గానామృతం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతును సత్కరించిన దృశ్యం



ఘంటసాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు